క్లుప్తంగా

నేటి నుంచి ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు


నల్లూరులో నిర్మితమైన ఆంజనేయస్వామి ఆలయం

కపిలేశ్వరపురం: నల్లూరులో భక్తులతో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని విజయ దుర్గాంబిక ఆలయ సమీపంలో నూతనంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. నేడు ప్రతిష్ఠా సంకల్పం, పుణ్యాహవాచనం పూజలు చేయనున్నారు. 16న ఆంజనేయస్వామి శిలా విగ్రహానికి యాజమానులు, భక్తులతో అభిషేకం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 17న స్వామి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం, ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

యువకుడి మృతి


మోర్తనానిబాబు (ఫైల్)

కె.గంగవరం: పాణింగపల్లిలో శుక్రవారం మోర్త నాని బాబు(26) పురుగుల మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నానిబాబు స్థానికంగా కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిచేస్తున్నాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. రోజులాగానే ఉదయం వరి పంట పొలంలో గులుకుల మందును పిచికారీ చేయడానికి కూలి పనికి కుదిరాడు. మందు పిచికారీ చేస్తుండగా పొలంలోనే అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానిక రైతులు ఆసుపత్రికి తరలించేలోపే మార్గ మధ్యలో మృతి చెందాడు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. నానిబాబు మృతితో పాణింగపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు పశు వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: తాళ్లపాలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి పుల్లెర్టన్ బ్యాంక్ నేతృత్వంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుందర్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రం వద్ద జరుగుతున్న ఈ వైద్య శిబిరాన్ని తాళ్లపాలం, ఉట్రుమిల్లి, అడపా వారి సావరం, చిన్న తాళ్లపాలం గ్రామాల పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి


పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ జే రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రా, స్వచ్ఛ దివాస్, మిషన్ సిటిజన్, నాన్ ఏపీ రెసిడెన్సి, చైల్డ్ విజైట్ ఆంధ్రా, పీఎసీఎస్ సర్వే తదితర అంశాలపై కార్యదర్శులు, సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కె.రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు షేక్ జహంగీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కొమ్మోజు నాగేశ్వరరావు కుమారుడిని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి పరామర్శించారు. శుక్రవారం 20వ వార్డు గొల్లపుంత కాలనీలో నివాసముంటున్న బాధితుని ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్న కార్యకర్త కుమారుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట సాధనాల శివ, పేరూరి మాధవి తదితరులు ఉన్నారు.

వైభవంగా చండీ హోమం

రావులపాలెం: స్థానిక భద్రమహంకాళమ్మ పుంతలో వేంచేసి ఉన్న పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఇందులో సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాలువల్లో సెప్టిక్ వ్యర్థాలు

- పంట పొలాల్లోకి దుర్గంధపు నీళ్లు
- మురికి కూపంగా డ్రైన్లు
- స్థానికులు, రైతుల ఆందోళన


మొగలిపాలెం రోడ్డులో కూరాడ కాలువలోనికి సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వదులుతున్న నిర్వాహకులు

కాజులూరు: గొల్లపాలెంలో తరచూ పంట పొలాలు, కాలువల్లోకి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు వదులుతుండడంతో స్థానికులు, రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటంలలో సుమారు 10 సెప్టిక్ క్లినింగ్ ట్యాంకర్లు ఉన్నాయి. వీరు ప్రతి రోజు కరప, కాజులూరు మండల గ్రామాల్లో సెప్టిక్ ట్యాంకులు క్లీనింగ్ చేసి వ్యర్థాలను మొగలిపాలెం రోడ్డులోని వంతెన వద్ద పంటపొలాలు, కూరాడ కాలువల్లో వదులుతున్నారు. సెప్టిక్ ట్యాంకు క్లినింగ్ వ్యర్థాలతో కాలువ మురికి కూపంగా మారిపోతోందని పూడిక తొలగింపునకు కూలీలెవ్వరూ పనుల్లోనికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి నేపథ్యంలో కూరాడ కాలువ నుంచే ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు సాగునీరు తోడుకోవాల్సి వస్తోందని సెప్టిక్ ట్యాంకర్ల నుంచి వ్యర్థాలు వదులుతుండడంతో కాలువ నీరు కనీసం పశువులు తాగేందుకు కూడా పనికి రాకుండా పోతోందని చెబుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా

సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కాలువల్లోనికి వదులుతుండగా పలువురు రైతులు, స్థానికులు అడ్డుకోగా ట్యాంకర్ నిర్వాహకులకు, రైతులకు మధ్య వివాదాలు తలెత్తిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై పలుమార్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదులు చేయగా ఆ నిర్వాహకులను పోలీసులు మందలించి పంపించారు. అయినప్పటికీ పరిస్థితి మారడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

భరించలేకపోతున్నాం



సెప్టిక్ ట్యాంకు నీళ్లు వదలుతుండడంతో కాలువనీరు దుర్గంధ భరితంగా మారిపోతోంది. దుర్వాసనను భరించలేకపోతున్నాం. ఆ గట్లపై నుంచి వెళ్లలేకపోతున్నాం. పశువులు సైతం కాలువ నీరు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.

– ద్వారంపూడి సోమిరెడ్డి, స్థానికుడు బందనపూడి

తోడుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం



సాగునీటి ఎద్దడి సమయాల్లో రైతులు డ్రైన్లలోని నీటిని పంటపొలాలకు తోడుకుంటూ ఉంటాం. కురాడ డ్రైన్‌లోనికి సెప్టిక్ ట్యాంకు నీళ్లు వదలుతుండడంతో నీరు దుర్వాసనతోపాటు మురికిగా ఉండడంతో తోడుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం.

– పడాల వీరవెంకట సత్యనారాయణరెడ్డి, రైతు మొగలిపాలెం

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో హెచ్ఎం సత్తిరాజు, ఉపాధ్యాయుడు శేషుబాబు

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్(ఎన్ఎంఎంఎస్)కు వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం డి.సత్తిరాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో పాఠశాలకు చెందిన వాసంశెట్టి చంద్రకార్తీక్, మేడిశెట్టి కుసుమప్రియలు అర్హత సాధించి, స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ విద్యార్థులు అర్హత పొందడానికి వారికి అత్యుత్తమ శిక్షణనిచ్చిన గణిత ఉపాధ్యాయుడు పి.శేషుబాబును రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు తదితరులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు గుర్తింపు


సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

- బ్రాండింగ్ సంస్థలకు మెప్మా అనుసంధానం
- కమిషనర్ రంగారావు

మండపేట: రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులు మార్కెట్లో తగిన గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో శుక్రవారం మహిళా సంఘాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ పెంచేందుకు వాటికి బ్రాండింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బ్రాండింగ్ సంస్థలకు మెప్మాను అనుసంధానం చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు తయారు చేసిన లక్ష ఉత్పత్తులు అమ్మకాలు జరిపి కోటి రూపాయలు ఆదాయం వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం 23, 24, 25, 26 వార్డుల్లో ఆయన పర్యటించి తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి చెత్త ద్వారా హోం కంపోస్టు తయారు చేసి ఆర్గానిక్ కూరగాయలు పండించాలని సూచించారు. హోటళ్ల తనిఖీ చేసి ఆహార పదార్థాలు తనిఖీ చేసి నాసిరకం ఆహార పదార్థాలు అమ్మే దుకాణాలను సీజ్ చేయాలని శానిటేషన్, ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

తపాలా శాఖ ప్రైవేటీకరణ తగదు


మండపేటలో నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

మండపేట: కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో దేశంలోనే నంబర్ వన్ బట్వాడా, పొదుపు కేంద్రంగా నడుస్తున్న తపాలాశాఖను ప్రైవేట్ పరం చేయడం తగదని తపాలా ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ, కే ఈశ్వరరావు, ఎండీఎం షరీఫ్ అన్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు శుక్రవారం ఆంధ్రాబ్యాంకు వీధిలో ఉన్న తపాలా కార్యాలయం ఎదుట ఆ శాఖ ఉద్యోగులు నిరసన తెలిపారు. తపాలాశాఖ ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలు చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కోసం వేతన కమిటీని నియమించాలన్నారు. డెలివరీ కోసం ఏర్పాటు చేసిన ఇండిపెండెంట్ డెలివరీ అమలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ తపాలా శాఖను సేవింగ్స్ బ్యాంక్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్‌గా విభజించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 23 వరకు ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. 25న విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి ధర్నాని విజయవంతం చేయాలని వారు కోరారు. తపాలా ఉద్యోగులు జి.వెంకట్రావు, ప్రవీణ్ ప్రియదర్శన్, ఎం.మధుసూదనరావు, ఎస్.దుర్గాదేవి, కె.అనూష, ఎం.అనూష, కంబాల పవన్‌సాయి, వీరభట్ల శ్రీనివాసరావు రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ టి.పుల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలి

రామచంద్రపురం: తపాలా శాఖను ప్రైవేటీకరణకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం 2023 పోస్టల్ చట్టాన్ని తీసుకురావటాన్ని తపాల ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నాయని తపాల శాఖ ఉద్యోగుల సంఘాల నాయకులు అన్నారు. స్థానిక ప్రధాన తపాల కార్యాలయం వద్ద వారు మీడియాతో మాట్లాడారు. యూనియన్లకు ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా సర్వీసులన్నీ తొలగిస్తూ ప్రైవేటీకరణ అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ఏకపక్ష వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. 2023 పోస్టల్ చట్టాన్ని అమలు చేసి పోస్టల్ ఐటీ 2.0 అని చెబుతున్న ఉద్యోగులు పొట్టకొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలకు అందించే సర్వీసులు కానీ ఉద్యోగుల సౌకర్యాలు కానీ ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వారికి ఇష్టం వచ్చినట్లు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయటం దారుణమన్నారు. ఎఫ్ఎన్‌పీవో నాయకులు బి సీహెచ్ వీరయ్య, టి రామ్‌గోపాల్, ఏవీ నరసింహరావు, ఎం వీనోద్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య


ద్వారపూడి పాఠశాలలో సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మండపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎనలేని కృషి చేసి, నిరాడంబర జీవితం గడిపిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని ద్వారపూడి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవితాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్వర్గీయ సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏడిద రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలోను ఘనంగా నిర్వహించారు. రెండు చోట్ల ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులకు బోనస్‌లు, ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తాలూకా స్థాయిలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని ఉత్తర్వులు ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. చనిపోయే నాటికి సొంత ఇల్లు కూడా లేని, అసెంబ్లీకి రిక్షాలో వెళ్లిన నిరాడంబర నాయకుడు నేటి తరానికి ఆదర్శప్రాయులని కీర్తించారు. కామన మాట్లాడుతూ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన కాపు కులస్తులను వెనుకబడిన వారిగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బండారు రాము, స్టాఫ్ సెక్రటరీ గండి స్వామిప్రసాద్, గొర్తి సుబ్రహ్మణ్యశర్మ, తూలూరి నరేంద్ర, పలివెల రుద్ర, కాంగ్రెస్ నాయకులు గేదెల శ్రీనివాస్, కొండ దుర్గారావు, అందుకూరి సాయి, కె వెంకట సత్యనారాయణ, షేక్ సందాని తదితరులు పాల్గొన్నారు.

వరిలో లోపాలను ముందే గుర్తించాలి


దంగేరులో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కె.గంగవరం: వరి పంటలో లోపాలు, తెగుళ్ల గుర్తించిన తర్వాతే ఎరువులు, పురుగు మందులు వాడాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా(ఏరువాక) కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నంద కిశోర్ అన్నారు. మండల పరిధిలోని శివల, దంగేరు గ్రామాల్లో వరి పంట పొలాలను శుక్రవారం వారు పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి సాగులో అక్కడక్కడ జింకు, పోటాష్‌లోపం, కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు తెగుళ్ల వస్తున్నాయన్నారు. వీటిలో జింకు లోపం వస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేటు చొప్పున కలుపుకుని 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. పోటాష్ లోపం గుర్తిస్తే అంకురం దశకు చేరుకున్న పొలాల్లో యూరియాతో పాటు ఎకరాకు 20 కేజీల పోటాష్ ఎరువును తప్పనిసరిగా కలిపి వేసుకోవాలన్నారు. కాండం తొలిచే పురుగు నివరణకు, ఉల్లికోడు నివారణకు ఆయా గ్రామాల్లో వ్యవసాయ సలహాదారులను అడిగి మందులు వాడాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్, ఏఓ మనోహర్, మండల ఏఓ బి.రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్నానాల రేవు.. ఇబ్బందులు పట్టవు


స్నానాల రేవు మెట్లపై ఖాళీ బ్రాందీ సీసాలు, చనిపోయిన కోడి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి స్నానాల రేవులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ రేవులో శుక్రవారం స్నానం చేసేందుకు వెళ్లగా మెట్లపై ఖాళీ బ్రాందీ సీసాలు, చనిపోయిన కోడి పడి ఉందని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భక్తుడు, అడ్వకేట్ పి.సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి సంఘటనలు భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తాయన్నారు. దీనిపై ఆలయ అధికారులు తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజును వివరణ కోరగా శుభ్రం చేయిస్తామన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య


రామరాజులంకలో నమోదు కార్యక్రమానికి వచ్చిన రైతులు

మలికిపురం: రైతులకు కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించే కార్యక్రమం వేగంగా జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేశ్ తెలిపారు. పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన నమోదు గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 8 వేల పీఎం కిసాన్ రైతులు ఉన్నారన్నారు. ఇప్పటికి 2 వేల మంది రైతులకు రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు



సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసరావు

మలికిపురం: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మలికిపురం ఎంవీఎస్‌జీఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనికి ప్రిన్సిపల్ ఎస్.ఆనందమహిని అధ్యక్షత వహించారు. రిసోర్స్ పర్సన్‌గా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగా వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సఖినేటిపల్లి ఎస్సై కె.శ్రీనివాస్, మలికిపురం ఏఎస్ఐ టి.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్క రమేష్‌బాబు, టి.ఆంజనేయులు, ఆర్ఆర్‌కె రాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మామిడికుదురు: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్య శిబిరం ఏర్పాటు చేశామని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు శుక్రవారం తెలిపారు. మొగలికుదురులోని జగ్గన్నపేట శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఇందులో రూ.4,500 విలువ చేసే కలర్ డాప్లర్ అల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండబాబు కోరారు.

తప్పుడు ఫిర్యాదుతో పొట్ట కొట్టే ప్రయత్నం

- రేషన్ డీలర్ పొట్ట కొట్టాలని చూసిన కూటమి నాయకుడు
- అధికారుల విచారణలో బయట పడిన నిజాలు


తనిఖీ సమయంలో రేషన్ షాపు వద్ద అధికారులతో పాటు కూర్చుని సరుకుల లెక్కలు సరి చూస్తున్న కూటమి నాయకుడు కిరణ్


వెల్ల శివారు వెల్లసావరం గ్రామంలో రేషన్ షాపు వద్ద తనిఖీ చేస్తున్న ఎంఎస్ఓ భాషా, రెవెన్యూ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: వెల్లకు చెందిన మేడిశెట్టి లక్ష్మి 2006 ఆగస్టు నుంచి రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నడచిన సమయంలో కూడా ఎప్పుడూ ఇబ్బంది రాలేదు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వెల్ల శివారు వెల్లసావరానికి చెందిన కూటమి నాయకుడు చింతలపూడి కిరణ్ కిశోర్ గత నెల చివరిలో ఒకసారి, మళ్లీ ఈ నెల 13న రేషన్ డీలర్ మేడిశెట్టి లక్ష్మిపై ఆమె స్థానికంగా ఉండడం లేదని హైదరాబాద్ వెళ్లిపోయారని రేషన్ సరకులు సరిగా ఇవ్వడం లేదని ఆర్డీఓకు ఒక మహిళతో కలసి ఫిర్యాదు చేశాడు. అయితే దీనిపై ఆర్డీఓ దేవరకొండ అఖిల ఆదేశాలతో ఎంఎస్ఓ బాషా, వీఆర్ఓ కె.యేసురత్నం, వీఆర్ఏ మంత్రిపూడి భీమశంకరం శుక్రవారం ఉదయం వెల్లసావరం గ్రామంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన కిరణ్ సమక్షంలోనే రేషన్ సరకుల పంపిణీలో ఏమైనా అవకతవకలు ఉన్నాయా అని ఆరా తీశారు. లెక్కలు సరిపోవడంతో గ్రామంలో ప్రజల నుంచి వివరాలు సేకరించారు. డీలర్ లక్ష్మి హైదరాబాద్‌లో ఉన్నారనడం అవాస్తవమని తేల్చారు. ఆమె వేలిముద్ర లేనిదే ఎండీయూ ఆపరేటర్‌కు సరకులు ఇవ్వడం సాధ్యం కాదు. గ్రామంలో 150 కార్డులు ఉంటే ముగ్గురికి తప్ప అందరికీ రేషన్ అందినట్టు గుర్తించారు. రేషన్ అందుకోని మహిళను ఆర్డీఓ కార్యాలయానికి తీసుకుని వెళ్లి అతడు ఫిర్యాదు చేయడంతో విచారణ చేశారు. అయితే డీలర్ హైదరాబాద్‌లో ఉన్నారని తను ఫిర్యాదు చేయలేదని సదరు మహిళ విచారణలో తెలపడం కొసమెరుపు. ఫిర్యాదులో ఏముందో తెలియకుండానే ఆమె సంతకం పెట్టింది. 15 రోజుల క్రితం పూర్తి స్థాయి విచారణ చేసి అంతా సక్రమంగానే ఉందని తేల్చిన రెవెన్యూ అధికారులు మళ్లీ 15 రోజులకే వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయడంతో వారిపై కూటమి నాయకుల ఒత్తిళ్లు ఏ మేరకు ఉన్నాయన్నది అర్థమవుతుందని స్థానికులు గుసగుసలాడుకున్నారు.

రేషన్ షాపు దూరం చేయాలనే దురుద్దేశంతో..



గడచిన 18 ఏళ్లుగా నేను రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాను. మా రేషన్ షాపుపై కేవలం 400 కార్డులు మాత్రమే ఉన్నాయి. అందులోనూ వెల్లసావరం గ్రామంలో 150 కార్డులు మాత్రమే ఉన్నాయి. ఎండీయూ వాహనాలు పెట్టిన తరువాత రేషన్ ఇచ్చే పని మాకు సంబంధం లేకపోయినా రేషన్ ఇవ్వలేదని, మా కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నామని తప్పుడు ఫిర్యాదు చేసి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు అధికారులు మా షాపుపై విచారణకు వచ్చేలా చేశారు. మా నుంచి డీలర్‌షిప్పు దూరం చేసి వారు తీసుకోవాలన్న దురుద్దేశంతోనే ఇలా చేస్తున్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసిన అధికారులకు కృతజ్ఞతలు.

–మేడిశెట్టి లక్ష్మి, రేషన్ డీలర్, వెల్ల